# కేపీహెచ్ బీలో సర్వీస్ రోడ్డును ఆక్రమించి వీధివ్యాపారాలు

## రోడ్డును ఆక్రమించి స్టాల్స్ ఏర్పాటు చేసుకున్న వ్యాపారస్తులు

## మొదట బతుకుదెరువు కోసం... ఆపై స్టాల్స్‌కు అద్దెలు, అమ్మకాలు

**సాయంత్రం ఈ రోడ్డులో నడవాలంటే నరకమే**
**నిత్యం నరకయాతన అనుభవిస్తున్న స్థానికులు**
**పుష్కాలంగా స్థానిక నాయకుల అండదండలు**
**గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు**

**కేపీహెచ్ బీ కాలనీ సర్వీస్ రోడ్డులో బతుకు తెరువు కోసమని నిరుపేదలు రోడ్డును ఆక్రమించి చిరు వ్యాపారాలు నిర్వహిస్తుంటే కొందరు పెద్దలు పేదల ముసుగులో చిరు వ్యాపారాల పక్కన చేరి శాశ్వత స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వ్యాపారాలు ఊపందుకున్నాయి. మహిళలకు సంబంధించిన అన్ని వస్తువులు తక్కువ ధరలతో అందుబాటులో ఉండడంతో ఈ సర్వీసు రోడ్డు నిత్యం ఇసుక వేస్తే రాలనంత కొనుగోలుదారులతో రద్దీగా ఉ ంటుంది. కాలనీ మొదటి రోడ్డు నుండి జేఎన్టీయూ ప్రధాన గేటు వరకు ఉన్న సర్వీస్ రోడ్ లో కొందరు చిరు వ్యాపారులు ఆక్రమంగా రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో సాయంత్రం అయితే ఆ దారిలో వెళ్లేలంటేనే నిత్యం నరకం అనుభవి స్తున్నమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**



కూకట్‌పల్లి, జూన్ 8 (జనం వార్త) : మరోవైపు షాపింగ్ కాంప్లెక్స్ లలో ఉన్న షోరూమ్ లకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. దారి పొడుగునా ఉన్న వీధి వ్యాపారుల వద్ద మహిళలకు సంబం దించిన వస్తువులు, బట్టలు, జ్యువెలరీ తక్కువ ధరకే దొరుకుతాయనే ప్రచారం ప్రజల్లో ఉండడంతో కెపిహెచ్ బి కాలనీతోపాటు చుట్టుపక్కల ఉండే పలు కాలనీలోని మధ్య తరగతి మహిళలు ఇక్కడ షాపింగ్ చేయడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతారు. దీంతో నిత్యం సాయంత్రం అయితే ఈ రహ దారి జాతరను తలపిస్తుంది. సాధరన రోజుల్లో ఉండే రద్దీ కంటే పండగ సమయా లలో ఇసుక వేస్తే రాలనంత జనాలతోఈ రోడ్డు రద్దీగా మారుతుంది.

### పుష్కాలంగా స్థానిక నాయకుల అండదండలు

గతంలో కొందరు వీధి వ్యాపారులు ఈ సర్వీస్ రోడ్ లో స్టాల్స్ ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ కు ఇబ్బంది అవుతుందని స్థానికుల ఫిర్యాదు మే-రకు అధికారులు స్టాల్స్ ను పూర్తిగా తొలగించారు. ఆనంతరం స్థానిక నాయకుల సహకారంతో తిరిగి చిరు వ్యాపారులతో పాటు పేదల పేరుతో పెద్దలు సైతం ఇదే సర్వీస్ రోడ్ లో స్టాల్స్ ఏర్పాటుకు పూనుకున్నారు. స్థానిక నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో వీధి వ్యాపారులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. దీంతో చిరు వ్యాపా రులు శాశ్వత స్టాల్స్ నిర్మా ణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీనికి తోడు నగరంలో పలు ప్రాంతాలలో రోడ్డు ఆక్రమణలో భాగంగా తొలగించబడిన చిరు వ్యాపారస్తులు సైతం ఇక్కడ తిష్ట వేయడానికి ఆసక్తి చూపడంతో జేఎన్టీయూ ప్రధాన గేటు నుండి కెపిహెచ్ బి కాలనీ మొదటి రోడ్డు వరకు ఇరువైపుల చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభమయ్యాయి.

### మొదట బతుకుదెరువు కోసం ఆపై స్టాల్స్ అద్దెలు, అమ్మకాలు

మొదట ఈ సర్వీస్ రోడ్ లో కొందరు చిరు వ్యాపారులు తమ బతుకుదెరువు కోసమని అధికారులను కరించమని మొర పెట్టుకున్నారు. అనంతరం కొందరు స్టాల్స్ ను అద్దెకివ్వడం ప్రారంభించారు. దీంతో ఇక్కడ స్టాల్స్ లేని వ్యాపారులు అధిక మొత్తంలో ఆడ్వాన్స్ ఇస్తూ స్టాల్స్ ను అద్దెకు తీసుకొని నెల నెలకు పెద్ద మొత్తంలో అద్దెలు సైతం చెల్లిస్తున్నారు. దీంతో ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు కోసం డిమాండ్ పెరిగింది. కొందరు చిరు వ్యాపారులు తమ స్టాల్స్ ను అమ్ముకుంటున్నట్లు సమాచారం. ఒక్కొక్క స్టాల్స్ సుమారు రూ.30 లక్షల రూపాయల వరకు అమ్ముకుంటున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారం అంతా స్థానిక నాయకుల సహకారంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. స్థానిక మున్సిపల్, ట్రాఫిక్ అధికారుల అండదండలు చిరు వ్యాపారులకు తోడు కావడంతో ఇక్కడ చిరు వ్యాపారులను ప్రశ్నించే వారే లేకుండా పోయారు.

### గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

కేపీహెచ్ బీ కాలనీ మొదటి రోడ్డు నుండి జేఎన్టీయూ ప్రధాన గేటు వరకు ఉన్న చిరు వ్యాపారుల్లో చాలామంది స్థానికేతరులని వాళ్లతో స్థానికంగా శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని స్వచ్ఛభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు, బిజెపి నియోజకవర్గం ఇన్ ఛార్జ్ మాధవరం కాంతారావు, స్థానిక బిజెపి నాయకులతో కలిసి గత కొన్ని రోజుల క్రితం గవర్నర్ ను కలిసి ఫిర్యాదు చేశారు. అక్రమంగా సర్వీస్ రోడ్డును ఆక్రమించి స్టాల్స్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ కు, స్థానికుల రాకపోకలకు ఇబ్బం దులు కలిగిస్తున్నారని మాధవరం కాంతారావు గవర్నర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఈ సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేసుకున్న స్టాల్స్ ను పూర్తిగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికైనా సంబంధిత ఉ న్నతాధికారులు స్పందిస్తారో... లేదో... వేచి చూడాలి... మరి.!!





